క్లుప్తంగా

విత్తన దుకాణాల తనిఖీ



సీడ్స్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక రేవతి, ముబారక్ సీడ్స్ దుకాణాల్లో శుక్రవారం కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శశిధర్, మహేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ముబారక్ దుకాణంలో రూ.7.23 లక్షల మిరప, పత్తి విత్తనాలు,రేవతి సీడ్స్ దుకాణంలో రూ.4.59 లక్షల విత్తన విక్రయాలను నిలిపివేశామని వీటికి సంబంధించిన సర్టిఫికెట్స్, రికార్డులను చూపిస్తే విక్రయాలకు అనుమతిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు.

పథకం ప్రకారమే దుష్ప్రచారం



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామ సర్పంచ్ పురుషోత్తంను తాను బెదిరింపులకు గురి చేస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి తప్పుడు ప్రచారం చేయడం తగదని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం చిప్పగిరిలో ఆయన మాట్లాడుతూ.. కుందనగుర్తి మాజీ సర్పంచ్ కొండా శేఖర్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పరామర్శించడానికి వెళ్లానని, దీనిపై సర్పంచ్ పురుషోత్తంపై దాడి చేసేందుకు వెళ్లినట్లు వక్రీకరించడం తగదన్నారు. స్థానిక టీడీపీ నాయకులతో కుట్రలు చేయించి ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండలంలో అల్లర్లు సృష్టించడానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలపై జిల్లా పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రంగస్వామి,నాయకులు హనుమన్న, శ్రీధర్, రాజన్న, శేఖన్న, బాలకృష్ణ, సతీష్, సూరి పాల్గొన్నారు.

విద్యా కానుక పరిశీలన



ఆలూరు ప్రభుత్వ పాఠశాల-1లో విద్యార్థులతో మాట్లాడుతున్న పరిశీలకులు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన విద్యాకానుక కిట్లను విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని జిల్లా జేవీకే కిట్ల పరిశీలకులు నాగరాజు సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో విద్యార్థులకు అందించిన కిట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించిన బూట్ల సైజు సరిపోకుంటే ఇతర పాఠశాలల నుంచి తగిన సైజు బూట్లు సరఫరా చేయించుకోవాలన్నారు. మిగిలిన బూట్ల వివరాలు ఫార్మాట్‌లో ఇస్తే సరైన సైజువి సరఫరా చేస్తామని చెప్పారు. ఎంఈఓ రామాంజినేయులు, పరిశీలకులు రాజశేఖరప్ప, హెచ్‌ఎం చౌడయ్య ఉన్నారు.

మద్యం ప్యాకెట్లలో చేతివాటంపై విచారణ

హొళగుంద: పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లలో చేతివాటం జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 24న వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆస్పరి మండలం నగరూరుకు చెందిన ఈడిగ వీరయ్యబాబును ఇద్దరు కానిస్టేబుళ్లు వెంబడించి పట్టుకుని మద్యం బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో కొన్ని మద్యం బాక్సులు దారి మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత కానిస్టేబుళ్లలో ఒకరిని ఏఆర్‌కు పంపించి, మరొకరిని కర్నూలుకు పిలిచి విచారణ చేపట్టారు.

మేలు చేకూర్చేందుకే 'జగనన్న సురక్ష'

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలు సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమం విజయవతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి శిబిరాలు

తుగ్గలి: మండలంలో జూలై 1న బొందిమడుగుల, కడమకుంట్ల, 4న ముక్కెల్ల, పగిడిరాయి, 5న మారెల్ల, చెన్నంపల్లి, 6న రామకొండ, ఉప్పర్లపల్లి, 11న ఎద్దులదొడ్డి, జీఎర్రగుడి, 13న పెండేకల్లు, జొన్నగిరి-1, 19న రాంపల్లి, జొన్నగిరి-2, 20న శభాష్‌పురం, గిరిగెట్ల, 28న తుగ్గలి, రాతన సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి చెప్పారు.

పత్తికొండటౌన్: మండలంలో జగనన్న సురక్ష శిబిరాలు జూలై 1న హోసూరు, 4న పందికోన, పులికొండ, 5న దూదేకొండ, కోతిరాళ్ల, 6న జూటూరు, చందోలి, 11న దేవనబండ, నలకదొడ్డి, 12న చిన్నహుల్తి, పుచ్చకాయలమాడ, 13న పత్తికొండ-5, పత్తికొండ-6 సచివాలయాలు, 15న పత్తికొండ-4, పత్తికొండ-3, 18న పత్తికొండ-1, పత్తికొండ-2 సచివాలయాలు, 19న చక్రాళ్లలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కవిత తెలిపారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ వ్యవస్థతో పెను మార్పులు
- నాడు పింఛన్ కోసం పడిగాపులు
- నేడు ఇంటికొచ్చి అందజేత



నాడు - పింఛన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు



నేడు - వేలిముద్రలు పడని వారికి ఐరిష్ విధానంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్, సంక్షేమ అధికారి

మద్దికెర: గత ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము అందుకోవాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. రోజుల తరబడి గంటల కొద్దీ కార్యాలయం వద్ద పడిగాపులు కాచినా పింఛన్ అందుకుంటామన్న గ్యారెంటీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పెనుమార్పులు చోటు చేసుకుని ప్రజల ఇళ్ల వద్దకే సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారకముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారు. గతంలో కుల, ఆదాయ, జనన, మరణ, ఇతర ధ్రువపత్రాల కోసం తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. ప్రస్తుతం ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో గతంలో ఉన్న ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి.

నాడు పింఛన్ల కోసం ఇబ్బందులు

నాడు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వ్యయ ప్రయాసలు పడేవారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఇచ్చే పింఛన్ కోసం ముందు రోజు రాత్రే అక్కడికి వెళ్లి పాసుబుక్కులు పెట్టి పడిగాపులు కాసేవారు. వేలిముద్రలు వేయించుకునేందుకు సర్వర్ పనిచేయకపోవడంతో రోజంతా వేచిఉండాల్సి వచ్చేది. ప్రతి నెలా 1వ తేదీన మొదలు పెడితే 7వ తేదీ వరకు పింఛన్లు ఇస్తుండేవారు. పోస్టాఫీసుకు మార్చడంతో మరింత ఇబ్బందులు పెరిగాయి. పింఛన్ కోసం వెళ్లి గంటల కొద్దీ వేచిఉండి తాగేందుకు నీరు లేక దాహార్తితో అల్లాడిపోయేవారు. నడవలేని వారు ఆటోలో వస్తే ఆ రోజు పింఛన్ ఇస్తారో లేదో తెలియదు. మళ్లీ మరుసటి రోజు రావాల్సి వచ్చేది. ఓ వైపు ప్రయాస, మరో వైపు రోజుల తరబడి వేచిఉండాల్సి వచ్చేది. ఎవరైనా కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే పింఛన్ లబ్ధిదారులు ఎవరోఒకరు చనిపోతే గానీ మంజూరయ్యేది కాదు. స్థలం, గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధిత కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిందే. నేడు అర్హత ఉంటే వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తులు తీసుకెళ్లి పింఛన్లు, పథకాలు మంజూరయ్యేలా చూస్తున్నారు.

మండలంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలు

మండలంలో వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధులు - 2828, వితంతువులు - 1059, ఒంటరి మహిళలు - 42, దివ్యాంగులు - 524, డప్పు కళాకారులు - 42, చేనేతలు - 20, గీత కార్మికులు - 5, చెప్పులు కుట్టేవారు - 61 మంది పింఛన్లు పొందుతున్నారు. వారితో పాటు దీర్ఘకాలిక రోగులు 39 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికి ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు అందుతున్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఖాదర్

సేవ చేసే భాగ్యం కల్పించారు



నాకు కేటాయించిన 50 ఇళ్ల పరిధిలో 5 దివ్యాంగ పింఛన్లు, 14 వితంతు, 2 ఒంటరి మహిళ, 23 వృద్ధాప్య పింఛన్లు ఉన్నాయి. ప్రతి నెలా రూ.1,16,750 పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నాను. 1వ తేదీ తెల్లవారుజామున పింఛన్ సొమ్ము ఇచ్చినపుడు లబ్ధిదారుల ముఖాల్లో కనిపించే ఆనందం ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. ఇలాంటి అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు

– మహాలక్ష్మి, వలంటీర్, పెరవలి, మద్దికెర మండలం.

ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు



దివ్యాంగుడినైన నేను గతంలో పింఛన్ తీసుకోడానికి మరొకరి సహాయం తీసుకుని వెళ్లేవాడిని. సొమ్ము తీసుకునేందుకు రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి సొమ్ము ఇస్తున్నారు. ఈ ఏర్పాటు చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటా. – కేశప్ప, దివ్యాంగుడు, మద్దికెర

సత్వర సేవలు అందించేందుకు కృషి

సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి ప్రభుత్వ సేవలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నాం. నెలాఖరు రోజు పింఛను సొమ్ము సంబంధిత వలంటీర్‌కు అందజేసి మరుసటి రోజున ఎంతమేర పంపిణీ చేస్తున్నారో పరిశీలిస్తుంటాం. అలాగే ఇతర సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. – ఆదినారాయణ, సచివాలయ సంక్షేమ అధికారి, మద్దికెర

నూతన వంగడాల పంపిణీ

వెల్దుర్తి: ఆముదం (ఐసీహెచ్-5), కంది (ఎల్ఆర్‌జీ-471, ఎల్ఆర్‌జీ 105) రకం నూతన వంగడాలను అధ్యయనం కోసం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రజ్ఞులు పలువురు రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్బీకే-1లో కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ నిరంజన్ రెడ్డి, డాక్టర చందన ఆధ్వర్యంలో ఏఓ అక్బర్ బాషా ఆధ్వర్యంలో వెల్దుర్తి, రామళ్లకోట గ్రామ రైతులకు పంపిణీ చేశారు.

విద్యుత్‌షాక్‌తో చత్తీస్‌ఘడ్ వాసి మృతి

కృష్ణగిరి: బతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటిన వచ్చిన వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన ఆగవేళి గ్రామ సమీపంలో జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆగవేళి గ్రామ పొలిమేరలోని పి.కోటకొండకు చెందిన రైతు పొలంలో బోరు వేసేందుకు గురువారం సాయంత్రం నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన కృష్ణారెడ్డి అనే ఏజెంట్ ద్వారా (కేఏ 01 ఎంఎస్ 8677) నంబరు గల బోరు బండి వచ్చింది. ఇందులో పని చేయడానికి చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఉమాశంకర్, విశ్వనాథ్, గోరిలాల్ తోపాటు మరో ఇద్దరు డ్రైవర్ తమిళనాడుకు చెందిన కన్నన్‌తో కలిసి వచ్చారు. బోరు పూర్తయిన తరువాత బండి పొలంలో నుంచి బయటకు వచ్చే క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తాకి ఉమాశంకర్(20)కు తీవ్ర గాయలయ్యాయి. వైద్యం కోసం డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పీరాసింగ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం డ్రైవర్ కన్నన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అంటరానితనాన్ని నిర్మూలిద్దాం

హొళగుంద: ఇంకా పల్లెల్లో కొనసాగుతున్న అంటరానితనం, కుల వివక్షతను శాశ్వతంగా నిర్మూలిద్దామని హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం కోగిలతోట గ్రామంలో తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఆర్ఐ దినోజ్ రాజశేఖరన్‌తో కలసి సివిల్ రైట్స్ డేను నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటే మరింత మెరుగైన సేవలందుతాయని వివరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ లాల్‌బీ, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, నాయకులు శ్రీరంగడు, బాబుల్‌రెడ్డి, నలకదొడ్డి కృష్ణ, ఎంపీటీసీ శ్రీనివాసులు లలితరామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక ఎడ్ల పందేలు

తుగ్గలి: ఎద్దుల బండలాగుడు పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని వైఎస్సార్‌సీపీ నాయకుడు బోగోలు నాగభూషణరెడ్డి అన్నారు. కాశిరెడ్డినాయన 18వ ఆరాధన మహోత్సవం సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీలలో ఊబిచెర్ల పుల్లెల గోవిందు ఎద్దులు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో సీసంగుంతల మదన్‌మోహన్‌నాయుడు ఎద్దులు, పుచ్చకాయలమాడ గొంగలి చంద్ర ఎద్దులు, పీఆర్‌పల్లి శివకోటి ఎద్దులు, పెద్ద పప్పూరు మండలం సోమన్నపల్లి లింగుట్ల ప్రసాద్‌నాయుడు ఎద్దులు నిలిచినట్లు వాఖ్యాత వాడాల రామానాయుడు తెలిపారు. విజేత వృషభాల యజమానులకు దాతలు మద్దికెర ఓబులేసు రూ.40 వేలు, హనుమంతు, శ్రీరాములు, రాజు, రంగ స్వామి రూ.30 వేలు, చిట్యాల రాజు, రవి, పెద్ద రంగన్న, నడిపి రంగన్న రూ.20 వేలు, మల్లికార్జునగౌడ్ రూ.10 వేలు, మైల రామకృష్ణ రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. నాయకులు ఈశ్వరరెడ్డి, లాలన్న, రవిరెడ్డి, మద్దిలేటి, కేశప్ప, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. టేబుల్ అజెండాలోని.. 17వ వార్డు మైనారిటీ కాలనీ ఏరియాలో రూ.7.50 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం, రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, 21వ వార్డులో గీతా మందిరం వద్ద రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, నాగిరెడ్డి పెట్రోల్ బంక్ నుంచి శివసర్కిల్ వరకు రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్, యంజీ పెట్రోల్‌బంక్ నుంచి వెంకటాపురం వైపు మిలటరీ కాలనీ మీదుగా రూ.25 లక్షలతో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు, గణేష్ కాలనీలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, కురువ కల్యాణ మండపం వద్ద రూ.40 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి సాధారణ నిధుల నుంచి కేటాయించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ గంగిరెడ్డి బదులిచ్చారు. డీఈలు మనోహర్ రెడ్డి, నీరజ, ఆర్ఓ బేబి, మేనేజర్ వరప్రసాద్, ఏఈలు శరత్‌చంద్ర, పవన్‌కుమార్, వైస్ చైర్మన్లు దివ్యకళ, నజీర్‌అహమ్మద్, కో-ఆప్షన్ మెంబర్ అబ్రార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్ఓ మృతి

పత్తికొండటౌన్: పత్తికొండ వీఆర్ఓ ఎం.సుధాకర్ (43) శుక్రవారం ఉదయం తిరుపతిలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుమారుడిని బీటెక్ కళాశాలలో చేర్పించేందుకు తిరుపతికి వెళ్లిన సుధాకర్‌కు గుండెపోటు రావడంతో అక్కడి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు తెలిసింది. సుధాకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పత్తికొండ ఎంపీపీ ఎం.నారాయణదాసుకు వీఆర్ఓ సుధాకర్ స్వయాన తమ్ముడు. వీఆర్ఓ మృతి పట్ల తహసీల్దార్ విష్ణు ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆలూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: తమ చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా వరుసగా నాలుగో ఏట అమ్మ ఒడి పథకం కింద రూ.13 వేలు తల్లుల ఖాతాల్లోకి జమ చేయడంతో శుక్రవారం పట్టణంలోని శివన్న నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోస్టర్‌కు పాలాభిషేకం చేశారు. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘ నాయకులు లక్ష్మన్న, సోమశేఖర్, సోము తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థుల కోసం వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు మంజూరు చేయడంతో శుక్రవారం ఆలూరు ప్రభుత్వ పాఠశాల-1 విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. థాంక్యూ జగన్ మామయ్య అంటూ వైఎస్సార్‌సీపీ విద్యా విభాగం నాయకుల ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పౌర హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకల రాజు

కృష్ణగిరి: మనుషుల మధ్య వైషమ్యాలు పెట్టుకోకుండా ఎదుటివారిని గౌరవించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకల రాజు సూచించారు. టి.గోకులపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన పౌరహక్కుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మనిషి ఎదుడివారిని గౌరవించాలే తప్పా అంటరానివాడిలా చూడాకూడదన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఎస్‌డబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, వీఆర్వో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ కె.ఆంజనేయులు, రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరుడి హక్కులు, బాధ్యతలను వివరించారు. గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రతి పౌరుడు హక్కుల గురించి తెలుసుకోవాలని తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ సూచించారు. శుక్రవారం వేముగోడు గ్రామం ఎస్సీ కాలనీలో పౌరహక్కులు, చట్టాలు, విధివిధానాల గురించి అవగాహన కల్పించారు. అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని అర్థిక అడ్డంకులు వచ్చినా ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని కొనియాడారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దారని, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు, వ్యవసాయ సామగ్రి అందిస్తున్నారని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి

దేవనకొండ: ప్రభుతం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు కృషి చేయాలని వీఏఓల జిల్లా సంఘం అధ్యక్షుడు బసవరాజ్ సూచించారు. దేవనకొండ సీల్ఆర్సీ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాల వీఏఓలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. సంఘం జిల్లా కోశాధికారి పద్మావతి, ఉపాధ్యక్షుడు రవికుమార్, మండలాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా అర్హుల జాబితా ప్రదర్శన



టి.గోకులపాడు ఆర్‌బీకేలో పంటల బీమా అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

హొళగుంద: నష్టపోయిన ప్రతి రైతుకు పంట బీమా పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మల్లికార్జున, ఏఓ ఆనంద్ లోకదళ్ అన్నారు. శుక్రవారం హొళగుంద మండలంలోని అన్ని ఆర్బీకేల్లో 2022 సంవత్సారానికి సంబంధించిన క్రాప్ ఇన్సూరెన్స్ లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించారు. ఏఓ మాట్లాడుతూ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఆర్బీకేలలో వీఏఏలను, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు. ఏఈఓ విరుపాక్షి, వీఏఏ సుంకమ్మ ఉన్నారు.

హాలహర్వి: ఖరీఫ్ – 2022 సీజన్‌కు సంబంధించి పంటల బీమాకు అర్హులైన వారి జాబితా విడుదలైనట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితాను ప్రదర్శించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో 7250 మంది రైతులకు రూ.13.85 కోట్ల పంటల బీమా సొమ్ము మంజూరైనట్లు తెలిపారు. మొత్తంగా 20299.11 ఎకరాలకు ఇన్సూరెన్స్ వర్తించినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించామని, రైతులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు ఆర్‌బీకేలో ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ పంట బీమా అర్హుల జాబితాను ప్రదర్శించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా 19,420 మంది రైతులకు రూ.11,79,81,417 పరిహారం మంజూరైందన్నారు. అలాగే ఫసల్ బీమా యోజన ద్వారా 1,825 మంది రైతులకు రూ.2,77,67,746 పరిహారం మంజూరైనట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని జూలై 8న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు.

తుగ్గలి: వైఎస్సార్ పంటల బీమా కింద మండలానికి రూ.13.52 కోట్లు మంజూరైనట్లు ఏఓ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వేరుశనగ, పత్తి, ఉల్లి పంటలు సాగు చేసి నష్టపోయిన 14,552 మంది రైతులకు పరిహారం మంజూరైందని చెప్పారు. ఈ మేరకు తుగ్గలి ఆర్‌బీకేలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. సర్పంచ్ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలో పంటల మంజూరైన రైతుల జాబితాను శుక్రవారం అన్ని గ్రామా లలోని ఆర్‌బీకేలలో ప్రదర్శించినట్లు ఏఓ అక్బర్‌బాష తెలిపారు. కలుగొట్ల ఆర్‌బీకేలో ప్రదర్శించిన జాబితాను ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి మొదటి విడతగా దాదాపు రూ.6 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

మద్దికెర: మండలంలో 3,200 మంది రైతులకు రూ.5.01 కోట్లు పంటల బీమా మంజూరైనట్లు ఏఓ రవి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రాలలో అర్హుల జాబితాను ప్రదర్శించారు.

నందవరం: మండలంలో 2022 ఖరీఫ్‌కు పంటల బీమా మంజూరైందని ఏఓ మద్రి స్రవంతి తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా కింద 29,471 మంది రైతులకు రూ.7,72,94,436, పంటల దిగుబడి ఆధారంగా 719 మందికి రూ.36,08,430 మంజూరైనట్లు వెల్లడించారు.